
రామ్ దివాకర్




**ఆయనకిప్పటికీ అనుమానమే, శంకరాభరణం సిన్మాలో శంకరశాస్త్రి పాత్ర తనను చూసే చిత్రీకరించి ఉంటారని! — ఆ బాధను దాచుకోలేక ఆయన తన ప్రియ మిత్రుడు వై. జెడ్. రావుకు చెప్పుకున్నారు.**

ఓవార్ని — అదెవరు గురూ?! — రావుగారి ఏడో కూతురు కదూ!? — అమ్మా గొప్పగా ఉంది!! చేసికుంటే ఈ పిల్లనే చేసికోవాలి! అప్పిగాడు క్రిందా మీదా అయిపోతున్నాడు.

'సర్లేనడు, ముందు ఆరుగురి కూతుళ్ల పెళ్లిళ్లు కానీ —' అంతరాత్మగాడి నసుగుడు.

ముందుకు సాగాడు. రోజూ ఆర్.కె.లో కాఫీ త్రాగడం బాగా అలవాటయిపోయింది. — అదీ పీకలదాక! బీడీకొట్లు, కాఫీ దుకాణాలను పోషించటానికి తెలుగువాడు పెట్టింది పేరు.

'ఛీ. ఏమిటో... యవ్వనం అంతా అడవికాచిన వెన్నెలయిపోతూంది. పెళ్లి చేసికుందామంటే వెధవది, రెక్కాడితే కానీ డొక్కాడని బ్రతుకాయె. వాడిచ్చే వెయ్యి స్కాలర్‌షిప్‌లో దాదాపు మూడొందలు తిండికి, మూడొందలు ఫీజులు గట్రా, మిగతా నాల్గొందలు స్టేషనరీ — కాఫీలకు బొటాబొటి సరిపోతూంటే — ఇక పళ్లు రోజూ దేనితో కడగాలి? వళ్లు దేనితో తోమాలిలి? బట్టలుతకడానికి ఏ బిళ్ల కొనాలి? — అప్పటికీ తను పళ్లు ఊర్నుంచి తెచ్చిన కచ్చికలతో తోమి, వారానికోసారి స్నానం చేసి అదా చేస్తున్నాడు కూడా. ఉన్న ఒక్క జీన్ పాంటును ఆర్నెల్ల నుండీ బాదుతున్నాడు. (పక్క నెవరూ కూచోటం లేదంటే అది వేరే సంగతి). రాత్రి రెండు దాటాక కాంపస్ రోడ్లమ్మట సగం కాలిన సిగరెట్ల ముక్కల నేరుకొని తృప్తిపడుతున్నాడు తను. అది లేకపోతే తెల్లారదు — ప్రొద్దుకుంకదు!'

ఆలోచనల్లోంచి తేరుకొని ఠక్కున ఆగిపోయాడు అప్పిగాడు కాన్వోహాల్ దగ్గర. — ఆగి బాగా పరీక్షగా చూశాడు. అనుమానం లేదు, సిగరెట్టు ముక్కే! ఎంత పెద్దదో! ముచ్చటేస్తుంది, చూస్తుంటే. అటువంటి ధర్మాత్ములుండ బట్టే కదా తనలాంటివాళ్లు ఈ కరువు దేశంలో ఇలా ఇంకా బ్రతుకుతున్నారు...

'వెధవన్నర వెధవా! పట్టపగలు — అదీ సాయంకాలం, పిల్లగాలులు వీచే ఈ పవిత్ర సమయాన, సిగరెట్టు ముక్క ఏరుకుంటావా?— ఏ పిల్ల చూసినా — నీ పరువేంగానూ?!' — అంతరాత్మగాడు కుతకుతలాడిపోయాడు.

'ఛా' అనుకున్నాడు అప్పిగాడు. నడక సాగించాడు. మొన్న అలాగే అర్థరాత్రి డ్యూటీలో ఉండగా ఎలా వచ్చాడో — అసలెందుకు వచ్చాడో — 'గైడు' వచ్చాడు.

వచ్చి, ''ఏమిటి?'' అన్నాడు.

''బ్బె... బ్బె... బ్బె... బ్బె...'' అన్నాడు అప్పిగాడు.

''ఏమిటి వెతుకుతున్నావు? — ఇంగ్లీషులో చెప్పు'' అబద్దాలు ఆటోమేటిక్‌గా వస్తాయి.

''ఉంగరం''

('వార్నీ దరిద్రమొహం తగలడా — నీకో ఉండగరం కూడానా!?' అంతరాత్మగాడు)

''బంగారమేనా?''

''ఛా మళ్ళా — ఇరవై ఎనిమిది కారెట్లు''

''బాప్‌రే — ఇరవై ఎనిమిది కారెట్లే — చీకట్లో ఏం కనబడుతుందీ — ఉండు'' గైడు పరిగెత్తాడు.

అప్పిగాడు పారిపోదామనుకునేంతలోనే టార్చిలైట్‌తో ప్రత్యక్షమయ్యాడు గైడు. అయి, చాలా తీవ్రంగా వెతికేస్తున్నాడు.



## చివరి క్షణం

"మీ నాన్న పోతూపోతూ కూడా ఏం చెప్పలేదా?" దీపక్‌ని అడిగాడు విశ్వం.

"లేదుసార్. వొక్కమాట కూడా మాట్లాడలేదు. ఆయన చివరిక్షణం దాకా మా అమ్మ పక్కనే వుంది కదండీ" బాధగా వివరించాడు.

—ఐ.వి.శర్మ (నరసరావు పేట)

'అమ్మో — అమ్మో — ఎన్ని సిగరెట్టు ముక్కలో — రేపట్నుంచి టార్చి తెచ్చుకోవాలి'

"ఉంగరం ఎంత పెద్దది?" గైడు అడిగాడు.

'నీ తలకాయంత' చిర్రెత్తుకొచ్చింది అప్పిగాడికి.

'వీడొకడు మధ్యలో. సిగరెట్ కాల్చటానికి లేదు. పైగా — ఉంగరం అట! వాడిదయినట్లే వెతికేస్తున్నాడు. కొంచెం సేపుంటే 'ఎవరికి దొరికితే వాళ్లదేనోచ్' అనేటట్లున్నాడు. ప్రొద్దున్న డిపార్ట్‌మెంట్‌లో చంపింది చాలక, అర్ధరాత్రి రోడ్ల మీద కూడానా?

"కుచ్ గిర్ గయాక్యా?" అంటూ వాచ్‌మన్ రంగంలోకి దిగటంతో మెల్లగా జారుకున్నాడారోజు, తను. వాళ్లిద్దరూ ఇంకా వెతుకుతూనే ఉండటం చూశాడు తను ఓ అరగంట తర్వాత కూడా. తేలుకుట్టిన వాడిలా కెవ్వుమన్నాడు, అప్పిగాడు ఒక్కసారి.

'ఏమిటి?' కంగారుపడ్డాడు అంతరాత్మగాడు.

'బాబోయ్ — శ... శంకరశాస్త్రి! దాక్కోవాలి... ఎక్కడ?' — చాలా కంగారు పడిపోయాడు. ఉప్పెనలో కిక్కురమనకుండా కొట్టుకుపోయి అవనిగడ్డలో తేలాడు కానీ, ఇంత కంగారు పడలేదు.

'ఛీ — నువ్వేం మగాడివి. ఒక మనిషిని చూసి భయపడటమా' అంతరాత్మ హేళన.

'నువ్వు నోరు ముసికొని పడివుండు — నీకేం తెలుసు?—'

చుట్టూ చూశాడు. చెట్టెక్కడానికి ప్రయత్నించి క్రిందపడ్డాడు. వెనక్కు పరిగెత్తి ఆవుల మందలో దూరిపోయాడు. అప్పిగాడు అలా భయపడిపోయాడంటే దానికి కారణం లేకపోలేదు. హాదు చూసింది — 'ఎటు జెడ్ రావు'గార్ని. ఆయన ఉద్యోగ రీత్యా అసిస్టెంట్ ప్రొఫెసరే అయినా, పాటలు పాడి జనాన్ని చంపేసి, ప్రభుత్వ సేవ చేస్తుంటాడు. ఆయన మీద కోర్టులో కేసు నడుస్తూంది కూడా — ఈ విషయంలో. బి.టెక్ కుర్రాళ్లు — తెలుగువాళ్లు కొందరు ఈయన పాటల్ని భరించలేక చదువుమానేసి పారిపోయారని ఇప్పటికీ లేక్‌సైడ్ చెప్పుకుంటారు. ఈయన బాధ తట్టుకోలేక, విరక్తిచెంది, హోస్టల్ ర్రీలో ఓ తెలుగు కుర్రాడు, ఉరేసుకోగా, మన రావుగారు సమయానికి వెళ్లి, కుర్రాడ్ని రక్షించి 'కలకానిదీ, జగమే మాయ' పాటలు ఏకధాటిన వినిపించేసరికి, ఆ కుర్రాడు జుట్టు పీక్కుని పిచ్చివాడయిపోయినట్లు ఒక అనఫీషియల్ వార్త. ఇంటింటికీ హోస్టల్స్‌కి వెళ్లి, ఆదమరిచి పాడి, ఆనందపడి వచ్చేస్తూంటాడాయన. కొంతకాలం భరించి, కుర్రాళ్లు ఈయన రావటం చూసి, హోస్టల్ వెనుకనుంచి 'సిటీ'కి పారిపోవడం మొదలుపెట్టారు.

వాళ్లలా పారిపోవటం చూస్తూ వూర్కోలేకపోయారు — ఎటుజెడ్ రావుగారు ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఇంటికి ఓ సాయం సమయాన సరదాగా వెళ్లి, నాల్గు పాటలు వరుసగా వినిపించి, "ఎలాగున్నాయి?" అని అడిగారు.

"ట్యూన్ బానేవున్నట్టుంది. నాకు తెలుగురాదు కదా— అందుకని అర్థం కాలేదంతే" అన్నారాయన.

"అబ్బెబ్బె... మీరు శానా పొరబడిపోయారు. నేను పాడింది... తెలుగు పాటలు కాదు. మీ బెంగాలీ పాటలే — రబీంద్ర సంగీత్!" అన్నారు రావుగారు.

డైరెక్టర్ 'ఠపీ'మని పడిపోయారు. అరగంటయిన తర్వాత లేచి, ఇంకా అక్కడే కూర్చుని కూనిరాగం తీస్తున్న ఎటుజెడ్‌రావు గార్ని, "మీ బాధేమిటి నాయనా?" అని అడిగారు గత్యంతరం లేక.

"మరేం లేదు — కుర్రాళ్లు మితిమీరి పోతున్నారు. ఈ మధ్య మన ఇన్‌స్టిట్యూట్ వదలి 'సిటీ'కి పారిపోతున్నారు. వాళ్లలా పారిపోకుండా — చాలా అర్జంటుగా హోస్టల్ చుట్టూ గోడ కట్టించవలసిన బాధ్యత డైరెక్టర్‌గా మీ మీద ఎంతోవుంది."

'నాకు బాబూ అర్జంటూ' అనుకున్నారు డైరెక్టర్. జీవితంలో రబీంద్ర సంగీత్, అసలు బెంగాలీ పాటలే పాడనని రావుగారి దగ్గర నోటు రాయించుకొని, తర్వాత హోస్టల్స్ చుట్టూ గోడ కట్టించేశారు.

కుర్రాళ్లు తక్కువ తిన్నారా?— గోడకు పునాదులు త్రవ్వటం మొదలయిన దగ్గర్నుండి, పొద్దున్నే నాలుగున్నరకు లేచి, హైజంప్ ప్రాక్టీస్ చేసి, ఆ అయిదడుగుల గోడని ఈజీగా దూకేసి పారిపోసాగారు. గోడ ఎత్తు పెంచితే కుర్రాళ్లు 'పోల్‌వాల్ట్' ప్రాక్టీసు చేస్తారని — ఇక లాభం లేదని, తెలుగువాడు కనబడితే చాలు — రోడ్డు మీదాపి, పేవ్‌మెంట్ మీద కూర్చోబెట్టి పాట వినిపించి ఆనందపడటం మొదలుపెట్టాడాయన.

ఆయన శంకరాభరణం సినిమా బొంబే రాకముందే, ఆ పాటలు ఎవరూ వినకముందే ఇంటింటికీ, హోస్టల్స్‌కి వెళ్లి, విపరీతంగా పాడి, వినిపించేసి మన్ననలను పొందేశారు. ఒక కుర్రాడు విజయవాడ నుండి శంకరాభరణం ఎల్.పి ఎరక్కపోయి తెచ్చి లెక్చర్ థియేటర్‌లో తెలుగు సిన్మానాడు వినిపిస్తే జనం 'ఛ! బాలసుబ్రమణ్య అన్ని తప్పులే పాడాడు. మన రావుగారే చక్కగ పాడారన్నారు. ఆయనిప్పటికీ తనే 'శంకరశాస్త్రి' ఒరిజినల్ అని మురిసిపోతుంటాడు. కొంతమందికి చెప్పారట కూడా — తను పుట్టగానే ఏడ్వలేదట — అదో రకంగా అరిచారట. గొప్ప గొప్ప వాళ్లంతా ఏవేవో లెక్కలేసి దానర్థం మాకు తెలీదు కానీ — అది శంకరాభరణ రాగంలో ఉందన్నారట!'


(ఆయన దగ్గర బంధువులు కొందరు ఆయన పుట్టగానే ఓంర్డ పెట్టారని చెబుతుంటారు).

—దాంతో పెద్దలు సంతసించి 'శంకర్' 'శంకర్‌శాస్త్రి' 'శంకర్రావు' 'శంకరరాముడు' గ్రటా పేర్లు పెడదమని జుట్టు పీక్కుంటున్న సమయంలో వాళ్ల బామ్మ 'బొయ్యే' మందట. అక్కడున్న వాళ్లందర్నీ అడ్డమైన తిట్లూ తిట్టి, శాపనార్థాలు పెట్టి, కళ్లు పేలిపోతాయందట. దాంతో అందరూ భయపడిపోయి, 'నీవే సెలవీయ్' అన్నార్ట. దాంతో ఆవిడ పధ్నాల్గు తరాలవారి పేర్లు కలిపి, మన శ్రీవారికి నామకరణం చేసిందట... 'శ్రీ బాల వెంకట శంకర నారాయణ పాండురంగ ఆదిశేష మురళీ గోపాలకృష్ణ... రావు!' కుర్రాళ్లు కొందరు ఆయన పేరు మీద రీసెర్చి చేసి, ఇంగ్లీషు అక్షరాలన్నీ ఆయన పేర్లో ఉండటం గమనించి, ఆయనకు 'ఎటుజడ్ రావు' నామకరణం చేసి, ఆనక తెలుసుకున్నారు.

దానివల్ల తమకు డాక్టరేట్ రాదని.

—ఆయనకిప్పటికీ అనుమానమే, శంకరాభరణం సిన్మాలో శంకరశాస్త్రి పాత్ర తనను చూసే చిత్రీకరించి

### విదేశాలు



ఉంటారని!— ఆ బాధను దాచుకోలేక ఆయన ప్రియ మిత్రుడు వై.జెడ్.రావుకు చెప్పుకున్నారు. చెప్పి — ఎవరికీ చెప్పవద్దని ఒట్టేయించుకున్నారు. వై.జెడ్.రావు భోజనాల దగ్గర మిరపకాయ కొరుకుతూ తన సతీమణికి ఆ సంగతి సరదాగా చెప్పి 'ఎవరికీ చెప్పొద్దేవ్ — కొంప మునుగుద్ది' అన్నారు. ఇక ఆవిడ కాలు నిలువలేదు. టాక్సీని మాట్లాడి (కాంపస్‌లోకే) ఇంటింటికీ వెళ్లి చెప్పివచ్చింది. పన్లో పనిగా, ఎటుజెడ్‌రావు గారింటికి కూడా వెళ్లి, నిద్దరోతున్న వారి సతీమణిని లేపి, సంగతి చెప్పి 'మరల ఎవరితోనూ అనమాకు సుమా' అని చెప్పి మరీవచ్చింది.

—ఆవిడసలే అనుమానం మనిషి. ఆవిడకు భయపడే, మనరావుగారు ఏ ఆడకూతురుకు గైడ్ కాలేకపోయాడు. (ఆ బాధను మరచిపోవటానికే ఈయన సంగీతం మొదలుపెట్టారని హిల్ సైడ్‌వాళ్లు చెప్పుకుంటారు).

—అనుమానం మొదలయిందంతే — అర్జంటుగా చింతకాయలు తినాలని పుట్టింటికెళ్లి 'శంకరాభరణం' సిన్మాచూసి, రివ్వున తిరిగివచ్చింది. వచ్చి రాగానే మొగుణ్ణి నిలేసింది.

"శంకరాభరణం 'శంకరశాస్త్రి' పాత్ర అచ్చు గుద్దినట్లు నీదేనన్నావట! నాకు తెలీకుండా వేషాలేస్తున్నావా? — నిన్నారాధించే ఆ మంజుభార్గవి పాత్ర ఎవరు?"

"ఛ! ఛ! అటువంటి దేమీ లేదు. నేను చాలా పతివ్రతుణ్ణి. గుడ్లూడిపోతాయి నన్నేమన్నా అంటే, కావాలంటే... నా... కాదు... కాదు... నీ మంగళ సూత్రం మీద ఒట్టు!" అన్నారు. ఆవిడొక్కసారి ఆనందపడిపోయింది. 'మా ఆయన బంగారం. ఆయన అందం, గళం చూసి ఓర్వలేక ఈ ఆడవాళ్లెప్పుడూ ఇంతేనబ్బా!"

—అప్పట్నుంచి తను శంకరశాస్త్రి యంతటి వాడినని మరల ఎవరితోనూ డైరెక్ట్‌గా అనలేదు ఎటుజడ్‌రావు. కానీ ఇప్పటికీ ఆయకు గట్టి నమ్మకం. ఎప్పటికైనా తెలుగు సమితి తన సంగీతానికి, కంఠమాధుర్యానికి సంతసించి, తనకు గండపెండేరం తొడుగుతుందనీ, ఆ ఫోటోలు పేపర్లో పడకపోవని! అందుకే ఆయన తన కాళ్ళు మాత్రం రోజూ కొబ్బరి పీచుతో కడిగి శుభ్రంగా ఉంచుతారు.

'హమ్మయ్య' అనుకుంటూ ఆవుల మందలోంచి సడన్‌గా లేచాడు అప్పిగాడు. సైకిల్‌పై పోతున్న కుర్రాడికి ఏవీ అర్థంకాక గుద్దేశాడు. పడిపోయాక తెలిసింది. తను గుద్దింది ఆ పిచ్చి ఆంబోతునని. అది చాలా సీరియస్‌గా ఆ కుర్రాడి మొహంలో మొహంపెట్టి తెగ చూస్తుంది — అంతే...

రోడ్డు కడ్డంగా నిలబడే ఈ ఆవుల మందల్ని రోజూ తెగతిట్టుకొనేవాడు. ఈ రోజు అవే తన మాన ప్రాణాల్ని కాపాడాయి. వడివడిగా నడక సాగించాడు అప్పిగాడు. లేడీస్ హాస్టల్ దగ్గరకు వచ్చి, కిటికీల్లోంచి ఎక్స్‌రే కళ్లతో చూశాడు. ఏం కనబడలేదు. 'ప్చ్' అనుకున్నాడు. పానకాలు బయట పేవ్‌మెంట్ మీద కూర్చుని భోరున ఏడుస్తున్నాడు. అతను రీసెర్చిస్కాలర్.

"ఏమిట్రా... ఏమయింది? అమ్మాయేమయినా?" గొల్లుమన్నాడు.

"చెప్పరా బాబూ!"

"అంతదృష్టమా" బోరుమన్నాడు.

"అసలేమయిందీ?"

"పాము—"

"పామే!" అప్పిగాడు కంగా పడిపోయి ఒక్క జంప్‌లో స్తంభం ఎక్కేశాడు. ఎక్కేసాక తెలిసింది. అక్కడ పాము లేదని, ఉంటే వాడక్కడ తీరిగ్గా కూర్చుని ఏడ్వడని. "కొంపదీసి కాటేయలేదు కదా?" సర్రున క్రిందకు జారాడు.

"పాము కాటేయలేదు కదా?" కంగారుగా అడిగాడు. గొల్లుమన్నాడు మరల "అంతదృష్టమా?"

చికాకేసింది అప్పిగాడికి. "సరిగ్గా చెప్పేడు, నే పోతాను"

"పాముని త్రొక్కాను" ఒళ్లు జలదరించింది, అప్పిగాడికి.

"అది కాటేయకుండా వెళ్లిపోయింది"

తేలికయ్యింది అప్పిగాడికి "మరీ ఏడుపు దేనికీ?"

"మా రీసెర్చి స్కాలర్ల బ్రతుకులింతే గురూ — ఒక్క పిల్లా కన్నెత్తి చూడదు. ఆఖరుకు పాము కూడా కరవదు" గోలు గోలు మన్నాడు. వాడినలాగే వదిలి బయలుదేరాడు. నాల్గడుగులు వేశాడో లేదో... బామ్మర్ది కనపడ్డాడు.

"ఏం బామ్మర్దీ, బాగున్నావా?"

బామ్మర్దిగాడికి లోపల కుతకుతలాడింది. పైకి మాత్రం "ఆ" అన్నాడు.

"మీ అక్కయ్య కాలేజీకి వెళ్తుందా?"

"ఏ అక్కయ్యా?" చికాగ్గా అన్నాడు.

"మూడో అక్కయ్య"

"ఆ — నాకూ పనుంది" వాడు బావురుమన్నాడు.

వాడు తెలుగు కుర్రాళ్లందరికీ బామ్మర్దే. కుర్రాళ్లందరూ వాడ్ని బామ్మర్దనే అంటారు. వాడూ పలుకుతాడు, అలవాటయిపోయి. వాడసలు పేరుమరచిపోయాడు, దాదాపు. కొత్తగా చేరిన క్యూ.ఐ.పి బామ్మర్దిని చూసి ముచ్చటపడి "నీ పేరేమిటి?" అని అడిగితే, "బామ్మర్ది" అని ఠక్కున సమాధానం ఇచ్చాడు. ఆ క్యూ.ఐ.పి కంగారుపడిపోయి, 'అహహ — నాకు పెళ్లయిపోయింది. నువ్వటువంటివి మనసులో పెట్టుకోమాక బాబూ" అంటూ పారిపోయి, మరల బామ్మర్దికి కనబడలేదు.

బామ్మర్దికి అప్పిగాడంటే మహాకోపం. అందరి ముందు కూడా 'బామ్మర్దీ' అని పిలుస్తాడు. ఆఖరుకు వాడక్కల ముందు కూడా. ఒకరోజు వాడి మూడో అక్క వచ్చి, "అప్పిగాడు నా వైపు రోజూ వెకిలిగా చూసి నవ్వుతాడు. మనింటి ముందు సైకిల్ మీద పదిసార్లు తిరుగుతాడు" అని ఫిర్యాదు చేసింది.

"మనింటి ముందు రోడ్డుంది. వాడికి సైకిలుంది. తిరుగుతాడు" అన్నాడు బామ్మర్ది.

"వాడ్నేం చేయలేవని చెప్పరాదూ?! — ఎందుకు అడ్డగాడిదలా ఉన్నావు! "

దాంతో వాడికి కోపం వచ్చేసింది.

"వాడ్నేం చేస్తానో చూడు" అంటూ గబగబా రెండు బస్కీలు తీసి బట్టలేసుకున్నాడు.

చకచక హాస్టల్లో అప్పిగాడి రూమ్‌దగ్గరకు వచ్చాడు,




## అడ్వాన్స్


'పొరపాటు మన ప్రేమ ఫలించక మన పెళ్ళి జరగకపోతే ఎలా?" గోపీ రాధికని అడిగాడు.

"అందుకేగా మరో ఇద్దర్ని ప్రేమించి అడ్వాన్స్‌లో వుంచుకున్నా" కళ్ళు తిప్పుకుంటూ చెప్పింది.

—వి.ఎస్.పి. గోపాల్ (కడప)

## మరుపు





ట్రిక్

"హొరేయ్ నే ప్రేమించిన రాణి నన్ను. పెళ్ళి చేసుకోవాలంటే ఏం చేయాలిరా?"

"నీ మేనమామకు బాగా డబ్బుందని చెప్పు"

రెండ్రోజుల తర్వాత అడిగాడు.

"నే చెప్పినట్టు చేశావా?"

"అహ. అలాగే చెప్పా. ఇప్పుడు రాణి నాకు అత్తయిపోయింది" కళ్ళొత్తుకుంటూ అన్నాడు.

—ఐ.వి.శర్మ (నరసరావు పేట)

వీరావేశంతో. లోపల్నుంచి 'కియ్యో — కుయ్యో' లాంటి కేకలు వినిపించాయి. కిటికీ కంతలోంచి ఏమిటోనని చూసి నీరుగారిపోయాడు బామ్మర్ది.

అప్పిగాడు కరాటే ప్రాక్టీసు చేస్తున్నాడు.

వచ్చినంత వేగంతో తిరిగింటికెళ్ళి "వాడు వెకిలిచేష్టలు చేస్తే చేయనీ — వెధవ, వాడే మట్టికొట్టుకు పోతాడు" అన్నాడు రొప్పుతూ. వాడక్క ఊరుకోలేదు. నిలేసింది.

"వాడు వెకిలిచేష్టలు చేస్తే — అది వాడికీ, నీకూ సంబంధించిన విషయం. నీవే చూస్కో. మధ్య నాకెందుకు? వాడికి కరాటే వచ్చు. పైగా వాడికి వైటు బెల్టుంది. నా మానాన నన్ను బ్రతకనీ. బ్రతికుంటే పదేళ్ళు ఇక్కడే రీసెర్చి చేసికొని బ్రతకొచ్చు" అని వెళ్ళిపోయాడు.

—గెస్ట్ హౌవుస్ క్రాస్ రోడ్ దగ్గరకు వచ్చాడు, అప్పిగాడు. ఆర్.కేకు ఇప్పుడే వెళ్ళాలా? — వీళ్ళంతా ఇంకో అరగంటకు కానీ రారు — గెస్ట్‌హౌస్‌కి వెళ్తే?... గెస్ట్‌హౌవుస్ వైపు తిరిగాడు. గైడ్ —పిల్లా, జెల్లా, గొడ్డూ గోదాతో, గెస్ట్ హౌవుస్ లాన్స్‌లోకి వెళ్తున్నాడు. మనసులోనే కసిదీరా తిట్టుకొని,. ఆర్.కెకు బయలుదేరాడు.

'వార్నీ! అదెవరూ? బెంగాలీ పిల్లకదూ?— మా గొప్పగా ఉంది. చేసికుంటే ఈ పిల్లనే చేసికోవాలి'

'ఇందాక రావుగారి ఏడో కూతుర్ని చేసికుంటావంటివిగా?' అంతరాత్మగాడు.

"అప్పుడన్నాను— ఈ పిల్లను చూడకముందు. బెంగాలీ నేర్చుకోవాలి రేపటి నుంచే"

"అప్పుడే డిసైడ్ చేసేయ మాకు. ఇంకొంచెం దూరంపోతే కుక్కపిల్ల కనపడవచ్చు"

నడక వేగం తగ్గించాడు. కాళ్ళు పీకుతున్నాయి.

ఎప్పుడైనా నడుస్తేగా. అప్పలు సైకిలు దిగేవాడు కాదు.

దానికిప్పుడు హఠాత్తుగా పంక్చరయింది.

సింహాద్రి కనబడ్డా... ...ారంగా నడుస్తున్నాడు ఆముదం తాగిన మొహంతో.

"ఏంరా" అప్పిగాడు పలకరించాడు. సింహాద్రి మొహం అటు వేలాడేసి వెళ్ళిపోయాడు మాట్లాడకుండా.

సింహాద్రి వద్దంటే వినకుండా కాంపస్ తెలుగు సమితి వేసిన తెలుగు సిన్మా చూశాడు, మొన్న. తెలుగువాడు కారం ఎక్కువ తినే మనిషి. బాగా రెచ్చిపోతుంటాడు, ఊరికే. అంచేత, వాడిని కంట్రోల్ చేయడం కోసం నెలకొక 'తెలుగు చిత్రరాజాన్ని' తెచ్చి వేస్తారు. ఆ సిన్మా చూసిన ప్రతివాడూ, ఓ మూడ్రోజులు అలాగే వుంటాడు.

రామనాథన్ వచ్చాడు, 'అలో' అంటూ వాడు 'సాంబారు'గాడు. తెలుగువాళ్లతో స్నేహం చేసి, తెలుగు నేర్చుకొని, సాధ్యమయినంతవరకు జాగ్రత్తగా ఖూనీచేసి మాట్లాడుతుంటాడు.

"ఎంగిరిందవర?" అప్పిగాడు.

"ఆర్కె వచ్చి వెళ్లిన్నాను. ఒరె — ఆ అమ్మాయి ఎవ్రడా?— మా రొంబ అళగ —"

ఠక్కున వాడినోరు మూసేశాడు. ఆవిడ వెళ్లిపోయింది.

"ఏమిరా?— ఏమి పోయింది?"

"ఏం పోలేదింకా — నీ పళ్లు ఊడిపోయిండేవి. ఆవిడకు తెలుగు బాగావచ్చు. తమిళ్ కూడా చక్కగా అర్థం అవుతుంది"

"మరి నాకు తెలిసి నేను కదా — వేగిరం పోవా — చూస్తాను" వెళ్లిపోయాడు.

అప్పిగాడికి ఎవరెవరికి తెలుగు వచ్చో, బాగా తెలుసు. దానికో కథ ఉంది. ఒకసారి స్నేహితులతో సాయంత్రం కాంపస్‌రోడ్ల మీద షికార్లు కొడుతూ, ఎవరో — అంటీ వెళ్తుంటే, ఆవిడ తెలుగని తెలియక 'సంస్కృతం' మాట్లాడాడు. అంతే! గూబగుయ్యిమంది. కిక్కురుమనకుండా పడిపోయాడు. ఆ నల్గురు స్నేహితులు 'మేం అందుకే ఉన్నాం' అన్నట్లు అప్పిగాడిని అర్జంటుగా హాస్పిటల్‌కి మోసుకొనిపోయారు. డాక్టర్లు అమ్మోనియా వాసన చూపించారు. చేయవలసింది, చేయగలిగింది చేశారు. లాభం లేకపోయింది. వాడు లేవలేదు. డాక్టర్లకు అనుమానమొచ్చి "మెడికల్ సర్టిఫికెట్ కావాలా?" అని అడిగాడు, మామూలు ధోరణిలో స్నేహితులు అంతెత్తున లేచారు. దాంతో డాక్టర్లు అదిరిపోయి, "మేం చేయగలిగినంతా చేశాము. మా చేతుల్లో ఇక ఏమీ లేదు. ఇక చేయగల్గేది ఆ భగవంతుడొక్కడే!" అన్నారు. దాంతో జనం పాలో మంటూ భజనలు మొదలుపెట్టారు. స్నేహితులు వాడిని హాస్టల్ రూమ్‌కి తీసుకొని వచ్చేస్తుంటే, హాస్టల్ కారిడార్‌లో టాయ్‌లెట్స్ దగ్గరకు రాగానే, వాడు ఠపీమని లేచి కూర్చున్నాడు. అప్పట్నుంచి, అమ్మోనియా వాసనకు గురికాని పేషెంట్లని అంబులెన్స్‌లో హాస్టల్‌కి పంపటం కద్దు — అది వేరే సంగతి.

అయితే ఆ రాత్రే — హాస్టల్ 'టు'లో ఇన్‌స్టిట్యూట్ తెలుగు

విద్యార్థులంతా భారీ ఎత్తున మీటింగు పెట్టారు. తెలుగుసిన్మాకు రాని జనం కూడా వచ్చారా మీటింగుకు. చాలా సీరియస్‌గా చర్చించారు విషయం.

"కాంపస్‌లో అసలు తెలుగు వాళ్ళెవరో తెలుగు వాళ్ళుకాని తెలుగు వచ్చిన వాళ్ళెవరో మనకు తెలిసిచావదు. తెలిసినా మనకు నోరు జారే అలవాటు ఎక్కువ. అది ఉగ్గుపాలతో పెట్టిన విద్య. ఓ కోశాన పోదు. పైగా స్కూళ్లో మన థర్డ్‌లాంగ్వేజ్ సంస్కృతమయె. అది ఆటోమేటిక్‌గా వచ్చేస్తుంటుంది. ప్రతీవాక్యం ముందో చివరో తప్పనిసరిగా ఉండాలి, దానమ్మ! రోడ్డు మీద నడుస్తున్నప్పుడు చుట్టూ తెలుగు ఫామిలీలు లేవు కదాని చూసుకొని మాట్లాడటం మనకుచాలా కష్టం. అది అయ్యేపని కాదు. మనం ఫ్రీగా మూవ్వాలి. ఫ్రీడం యూజ్ అవర్ బర్త్‌రైట్"

"రైట్... రైట్... రైటో" అన్నారు జనం.


"దీనికి తగిన పరిష్కారం ఆలోచించాలి"

జనం తీవ్రంగా ఆలోచించారు. హాస్టల్ కేంటీన్ నుండి 'టీ'లు తెప్పించి తాగి ఆలోచించారు. ప్రక్కవాడి జుట్టు పీకి మరీ ఆలోచించారు. లాభం లేకపోయింది.

"ఒక్కటే పరిష్కారం" అన్నాడు జనంలోంచి ఒక కుర్రాడులేచి.

"ఏమిటి... ఏమిటి?" ఆత్రంగా అడిగారు.

ఎంట్రీ



''మనం సంస్కృతం మాట్లాడటం మానేయాలి'' అన్నాడు అంతే! వాడి జుట్టుపీక్కు, గిల్లి, సమితినుండి బహిష్కరించారు. ఆలోచించి, ఆలోచించి, లాభం లేదనుకుంటున్న సమయంలో 'అవుడియా' అన్నాడు అప్పిగాడు.

''ఏమిటీ?!''

''మనకొక చిన్న ఇన్‌స్ట్రుమెంట్ కాల్కులేటురంత పోనీ ఇంకా చిన్నది వాచీ అంత అనుకోండి— వుండాలి. అది ప్రతి కుర్రాడి దగ్గరా వుంటుంది. దాన్ని జేబులో పెట్టుకోవచ్చు, చేతికి కట్టుకోవచ్చు—''

''మెడ కేసుకోవచ్చు కానీ అసలు సంగతి చెప్పియేదు''

''అది, పది గజాల దూరంలో తెలుగు వాళ్ళు వుండగానే (కుర్రోళ్ళు కాదుసుమా!) అలార్మ్ ఇస్తుంది''

''ఎలా?''

''బీప్ బీప్‌మని''

''అది సర్లేవోయ్. అదెలా పనిచేస్తుంది?''

''అదంతా మనం వర్కవుట్ చేయాలి. ఇది జస్ట్ అయిడియా మాత్రమే—''

''బాగుం''దన్నారు.

''ఇటువంటి ప్రోడక్ట్ మనకేకాదు. మన సోదరులు మిగతా ఐఐటి వాళ్ళు ఇతర మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ బి.హెచ్.యు బిట్స్‌లాంటి కాలేజి — కాంపెస్‌లు, ప్రవాసాంధ్రులు, అందరూ వాడుకోవచ్చు. ఈ బాధ మనకే కాదు. దేశవ్యాప్తంగా... అన్ని కాంపస్‌ల్లోనూ వుంది. అసలిది అంతర్జాతీయ తెలుగు కుర్రాళ్ళ సమస్య. కాబట్టే, ఈ బృహత్పథకాన్ని మనం చేపట్టి, సాధించగల్గితే, మనం తెలుగువాళ్ళకి ఎంతోసేవ చేసిన వాళ్ళమవుతాము. దిస్ ప్రొడెక్టు ఈజ్ ఎ బూన్—'' ఆవేశపడిపోయాడు అప్పిగాడు.

''తెలుగు సమితికీ—జై'' అని వెంటనే అప్పిగాడి కమిటీని వేసారు. ఆ కమిటీ (అప్పిగాడు కాక మరిద్దరు) వెంటనే ఇండస్ట్రియల్ డిజైన్ సెంటర్‌కి వెళ్లి ఓ డిజైనర్‌ని పట్టింది. ఆయన సాదరంగా ఆహ్వానించి సెకండ్ ఫ్లోర్‌లో తన రూమ్‌కి తీసుకొని వెళ్ళి కూర్చోబెట్టారు.

''చెప్పండి''

మూడోక్లాసు కుర్రాడు ఎక్కం అప్పజెప్పినట్లు టకటకా చెప్పేసారు—, ఏ మాత్రం సిగ్గుపడకుండా.

''ఓస్ దాందేముంది సింబుల్. డిజైన్ పదిరోజుల్లో ఇచ్చేస్తాను'' అని అయిదు నిమిషాలు కాల్కులేటర్ మీద లెక్కలేసి ''మొత్తం స్కెచెస్, ప్రెజెంటేషన్ డ్రాయింగ్, టెక్నికల్ డ్రాయింగ్, మోడల్ అంతా కలిపి... వందగంటల పని వుంటుంది. నా రేటు గంటకు డెబ్బది రూప్యములు ఈ లెక్కన... మొత్తం ఏడువేలు—''

'థపీ థపీ థపీ' మని కిటికీల్లోంచి దూకేసారు ముగ్గురు. జనం ఆ మాట తలబెట్టలేదు మరల.

అయినా అప్పిగాడు పట్టుదలతో పగలనకా రాత్రనకా అవస్థపడి డిజైన్‌చేసి ఓ ప్రొటోటైప్ తయారుచేసాడు. తెలుగులోనున్న సంస్కృత పదాలన్నీ వివిధ రూపాల్లో యాసల్లో ఆ ప్రొడక్ట్‌లోని చిన్న టేప్‌లోకి ఎక్కించాడు. పదిగజాల దూరంలోని మాటలన్నీ 'రిసీవర్' క్యాచ్ చేస్తుంది. టేప్‌లో వున్న మాటలు కావి ల్లాంటివి కానీ వస్తే ఆ ప్రొడక్ట్ ఏ గొడవా చేయదు. అటువంటి పదాలుగాక వేరే తెలుగుమాటలు వినబడితే అది అలార్మ్ ఇస్తుంది. దీన్నిబట్టి జాగ్రత్త పడవచ్చు.

హాస్టల్స్‌లో టెస్ట్ కూడా చనాడు. అద్భుతంగా పనిచేసింది. కానీ రోడ్డుమీద అది అస్సలు అలారం ఇవ్వ లేదు. అది బయట రోడ్లమీద ఎందుకు అలారం ఇవ్వ టంలేదో ఇప్పటికీ అర్థం కాలేదు అప్పిగాడికి. లాభంలేదని పదిరోజులు అవస్థపడి కాంపస్‌లో తెలుగు వాళ్ళెవరో, తెలుగు వచ్చిన వాళ్ళెవరో తెల్సుకొని జాగ్రత్త పడసాగాడు.

—'బి క్వార్టర్స్' వైపు తిరగబోయాడు అప్పిగాడు.

'బాబోయ్! ఈ పిల్ల ఇక్కడుందీ!?' కంగారుపడ్డాడు.

'ఎవర్రా నువ్వు? చిన్న పిల్లలకు భయపడతావ్?' అంతరాత్మ గాడిగేలి.

'నువ్ నోర్ముయ్— నీకేం తెల్సూ?' కసిరాడు.

అప్పిగాడికి చిన్న పిల్లలంటే మా ఇష్టం. ఓ రోజువ ఆ చిన్నపిల్లమట్టిలో చెడ్డీలేకుండా ఆడుకుంటుంటే ముచ్చటపడి, ''ఓంతులమ్మ— నీపేరేంటి?'' అని అడిగాడు.

అంతే! ఆ పిల్ల ''బేర్ బేర్'' మంది. చుట్టుపక్కల క్వార్టర్స్ వాళ్ళు అర్జంటుగా బయటకు వచ్చేసారు. వచ్చి అప్పిగాడిని అనుమానంగా చూడసాగారు. ఇబ్బంది పడిపోయాడు అప్పిగాడు. ఓ వెకిలి నవ్వు పారేసి మెల్లగా జారుకున్నాడు. అప్పట్నుంచి ఆ పిల్లంటే హడల్ అప్పిగాడికి.

— ఆ పిల్ల ఈ రోజు వాళ్ళ వీధి వదిలి ఇక్కడ ఆడుతుంది. తప్పదు, ప్రక్కకు తిరిగి, ఆర్.కె. ఎదుట గేట్‌రోడ్ పట్టాడు. కార్నర్‌లో పి.జి.రావు కనపడ్డాడు.

''ఏం గురూ— బాగున్నావా?'' అప్పిగాడు.

''ఏదో గురూ— తెలుగు అసోసియేషన్ వల్ల ఇలా వున్నాను. వస్తాను. పనుంది'' అతను రీసెర్చి స్కాలర్.

మనిషి వంగిపోయున్నాడు, పాపం— పోయినేడు తెలుగు సమితికి జాయింట్ సెక్రటరీగా వుండి గాడిదలా చాకిరీ చేసాడు. అడ్డమైన పనులన్నీ చేసాడు. అప్పట్లో ఆ చాకిరీకి తట్టుకోలేక వాల్లు కాళ్ళమీద నడిచేవాడు. ఇప్పుడిప్పుడే కాస్తలేవగల్గుతున్నాడు. వచ్చే సంవత్సరానికి పూర్తిగా కోలుకుంటాడని డాక్టర్లన్నారు.

పి.జి.రావు తెలుగు సమితి లోతుపాతులు తెల్సిన మనిషి. సమితిని క్షుణ్ణంగా అర్థం చేసికున్న మహానుభావుడు. అందుకే ''వేరే తమిళ, కన్నడ, మళయాళ సమితుల సినిమా పోస్టర్లను అతికించి ఆ వచ్చిన డబ్బుతో నడపాల్సిన స్థితిలో వుంది మన తెలుగు సమితి'' అనేవాడు. సమితి ఫండ్స్‌కోసం అన్నది ఆచరించటానికి కూడా ప్రయత్నించడు పాపం. ప్రయత్నించి, మళయాళ సంఘం వాళ్ళని ఒప్పించి పోస్టర్‌కు రూపాయి చొప్పున బేరం ఆడాడు.

ఓ రాత్రి రెండుగంటలకు సైకిల్ పోస్టర్లు నిచ్చెన బకెట్ తీసికొని బయలుదేరాడు. అది మళయాళ ఆర్టుమూవీ. పోస్టర్ల మీద ఒక్క బొమ్మాలేదు. పసుపు బేక్‌గ్రౌండ్ మీద నల్లని అక్షరాలున్నాయంతే— అదీ మళయాళంలో ఏది క్రిందో ఏది పైనో అర్థం కాలేదు. డేటూగ్రటా చూద్దామంటే ఆ చీకట్లో ఆ మూపు కు ఆనలేదు అసలుందోలేదో—

లీడర్ షిప్ క్వాలిటీల్లో డెసిషన్ మేకింగ్ కూడా ఒకటని గుర్తొచ్చి, ఆవేశంతో పోస్టర్లన్నీ చకచకా అంటించేసి వచ్చేసాడు. మర్నాడు మళయాళ సంఘం వాళ్ళు పి.జి.రావును కాగిడాలతో వెతికారు దొరకలేదు.

'హమ్మయ్య' అనుకున్నాడు. ఆర్.కె.గేటు దగ్గరయ్యేసరికి.

'మన జనం వచ్చేసి వుంటారు'

ఒక్కసారి ఆగిపోయాడు. కోటిరెడ్డి పరిగెత్తుకొస్తున్నాడు. పైన మూడిండిగో బనీను క్రింద చారల చెడ్డీ చెప్పల్లేవు. వాణ్ణి పట్టుకున్నాడు అప్పిగాడు. కోటిరెడ్డి గింజుకున్నాడు.

''ఏమిట్రా— జాగింగ్ ఎప్పుడు మొదలుపెట్టావు?''

''నీ పిండాకూడు జాగింగట. నన్నొదులు..'' గింజుకున్నాడు కంగారుగా.

''ఏమిట్రా – ఏమయింది?''

''మన గ్రూపంతా వచ్చాం. దార్లో మన తెలుగు లైబ్రరీ కమిటీ పట్టుకుంది. చందాలడిగారు. లేవన్నాం. వాళ్ళంతా తప్పించుకొని పారిపోయారు. నేనుదొరికిపోయా—పేంటుపోతే పోయిందనీ — బాబోయ్'' పరుగందుకున్నాడు, చేతిలోంచి జారిపోయి.

''అలో – అప్పిగారూ'' కేకవినిపించింది.

కాస్త అనుమానం వేసింది ఎవరో 'గారూ' అన్నందుకు.

'ఎవరబ్బా?!'

తిరిగి చూసాడు. లైబ్రరీ కమిటీ. అంతే—

క్రిందామీదా చూడకుండా, హాస్టల్‌కు పరుగందుకున్నాడు.

*

(ఐ.ఐ.టి, బొంబే తెలుగు సాంస్కృతిక సమితికి— అంకితం)

—రచయిత



## మామగారు

శోభనం గదిలో అడిగాడు భార్యని ''నేనందగాణ్ణి కాను. నీ అంత చదువుకున్న వాణ్ణి కూడా కాను. అయినా వరించి పెళ్ళాడావు. ఎందుకో అర్థం కావ టంలేదు'' అన్నాడు.

''మా నాన్న వల్లే,'' చెప్పింది.

''అంటే?''

''మా నాన్న బాంక్ మానేజర్. మీ ఫిక్స్‌డ్ డిపాజిట్లు అన్నీ చూసి చెప్పారు. పెళ్ళి చేసుకోమని'' వివరించింది.

—ఐ.వి.శర్మ (నర్సరావు పేట)